

పక్షుల లెక్క తేలింది

8లో ▸

జన్నారం అటవీ డివిజన్‌లో నిర్వహించిన సర్వేలో అధికారులు 201 రకాల పక్షులను గుర్తించారు. 11 రకాల పక్షి జాతులు అంతరించిపోయే దశలో ఉన్నట్లు పేర్కొన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం : 6:20	శుక్రవారం : 5:14

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 / 17.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా కనిపిస్తుంది. చలి కాస్త పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఎండిన పొలాల పరిశీలన



సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి స్పందన

కడెం: ఈనెల 5న ‘పంట తడికి.. కంటతడి’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ మండలంలోని కొత్త మద్దిపడగ, ఎలగడప గ్రామాల్లో సాగునీరు అందక ఎండిన పంట పొలాలను పరిశీలించారు. కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఏవో దినేశ్, ఏఈవోలున్నారు.

కార్డుల జారీ ప్రక్రియ చేపట్టాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం) కార్డుల జారీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఈ ప్రక్రియపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశమై కార్డులు జారీ చేసే క్రమంలో వైద్య బృందానికి అవసరమైన పరికరాలు, సిబ్బంది తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యూడీఐడీ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేలా దివ్యాంగులకు అవగాహన కల్పించాలని సూచించారు. 21 రకాల వైకల్యం కలిగినవారు యూడీఐడీ కార్డు పొందవచ్చని తెలిపారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కలిగినవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వైద్యారోగ్యశాఖ అధికారులు గోపాల్, సునీల్, సురేశ్, డీపీఎం శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: బేటీ బచావో.. బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం పలువురు డిగ్రీ కళాశాల విద్యార్థినులతో సమావేశమై చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేటీ బచావో.. బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను జనవరి 22నుంచి మార్చి 8వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ హెల్ప్‌లైన్ నంబర్లు 100, 1098,181, 1930, బాల్య వివాహ నిర్మూలన చట్టం-2006, బాలికలు, మహిళల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏసీడీపీవో నాగలక్ష్మి, మిషన్ శక్తి సమన్వయకర్త సవిత, మిషన్ శక్తి బృందం సభ్యులు, విద్యార్థినులు, అధ్యాపకులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిపన్ను వసూలు చేయాలి



మన్మద్‌లో సెగ్రిగేషన్ షెడ్ పరిశీలిస్తున్న శ్రీనివాస్

లోకేశ్వరం: వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని మన్మద్, రాజూర గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్, నర్సరీ, డ్రైనేజీలు, రోడ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. నర్సరీలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని తెలిపారు. సెగ్రిగేషన్ షెడ్‌లో సేంద్రియ ఎరువు తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించే రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటరమేశ్, ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్, సెక్రటరీ మహేశ్ ఉన్నారు.

26 దుకాణాల సీజ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని క్లబ్ కాంప్లెక్స్ సొసైటీలోగల 26 దుకాణాలను బుధవారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. కొద్ది సంవత్సరాలుగా మున్సిపాలిటీకి పన్ను చెల్లించకపోవడంతో బకాయిలు రూ.9.90 లక్షలకు చేరుకున్నట్లు ఆర్‌ఐ అనూష్ తెలిపారు. రెడ్ నోటీసులు జారీ చేసినా పన్నులు చెల్లించకపోవడంతోనే దుకాణాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

అందని టీ-ఫైబర్



సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో టీ-ఫైబర్ నెట్ పరికరాలు ఇలా వృథాగా పడి ఉన్నాయి. గ్రామపంచాయతీ కార్యాలయం వరకు కేబుల్ వైర్ వేసి ఫైబర్ నెట్ పరికరాలు బిగించినా కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో కొన్నేళ్లుగా పరికరాలు ఇలా నిరుపయోగమయ్యాయి. జిల్లాలో ఫైబర్ పథకం పనుల అమలు తీరుకు ఇదొక నిదర్శనం.



లక్ష్మణచాంద మండలం మల్లాపూర్ పంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా పరికరాలు

- ఇంటర్నెట్ సౌకర్యం లేక మరుగున పడిన ఈ-పాలన
- నిరుపయోగమైన పరికరాలు
- ఏ పనికైనా మండల కేంద్రానికే..
- డిజిటల్ సేవలు అందేదెన్నడో!

నిర్మల్‌చైన్‌గేట్: ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్ సేవలు ఎంత అవసరమో చెప్పాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలతో పాటు ప్రతీ పనికి సాంకేతికత ముడిపడి ఉంది. ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ-పాలన, ఇంటింటికీ తక్కువ ధరకే ఇంటర్నెట్ అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 2017లో టీ-ఫైబర్ సేవలకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, బ్యాంకులు, రైతువేదికలు, ఇతర ప్రజాసేవల సంస్థలకు అధిక వేగంతో కూడిన ఇంటర్నెట్ సౌకర్యం అందించేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా మిషన్ భగీరథ పథకం పైపులైన్లు నిర్మించే సమయంలో టీ-ఫైబర్ కేబుల్ వేశారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనూ టీ-ఫైబర్ పరికరాలనూ అమర్చారు. అయితే ఇప్పటివరకు టీ-ఫైబర్ సేవలు అందుబాటులోకి రాలేదు.

ఎన్నికల్లోపు అందుబాటులోకి వచ్చేనా?

ప్రస్తుతం గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, నామినేషన్లు, ఎన్నికల నిర్వహణ, విజేతల వివరాలు ఇలా ప్రక్రియ అంతా ఇంటర్నెట్ ద్వారానే నిర్వహించాల్సి ఉంటుంది. గ్రామాల్లో సేవలు అందుబాటులో లేక మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాగా, గ్రామపంచాయతీల్లో ఇంటర్నెట్ సేవలు ప్రారంభించకముందే విద్యుత్ సౌకర్యం కోసం మీటర్లు బిగించారు. దీంతో పంచాయతీల్లో రూ.వేలల్లో బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. సేవల మాటేమో గాని బిల్లుల మోత తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీ కార్యాలయాల్లో టీ-ఫైబర్ సేవలు అందుబాటులోకి తేవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

జాడలేని ఈ-పాలన

అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, నిధుల కేటాయింపు, ఆదాయం, వ్యయాలు, జీతభత్యాలు, జనన, మరణ ధ్రువపత్రాల జారీ, ఇంటి పన్ను తదితర సేవలను గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలకు డిజిటల్ రూపంలో అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. జిల్లావ్యాప్తంగా 396 గ్రామపంచాయతీలుండగా.. సుమారు 36మంది ఈ-పంచాయతీ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో టీ-ఫైబర్ కేబుల్, పరికరాలు బిగించారు. విద్యుత్ సౌకర్యం కోసం సోలార్ ప్లేట్లు, ఇన్వర్టర్ బ్యాటరీలు అమర్చారు. సాంకేతిక సిబ్బంది పంచాయతీలకు వచ్చి టెస్టింగ్ కూడా నిర్వహించారు. క్లస్టర్ల వారీగా ఈ-పంచాయతీ ఆపరేటర్లను నియమించారు. కంప్యూటర్లు, ప్రింటర్లు అందించారు. అయితే పంచాయతీల్లో ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులోకి రాక ఈ-పాలన అమలులోకి రాలేదు. దీంతో చాలామంది ఈ-పంచాయతీ ఆపరేటర్లు మండల పరిషత్ కార్యాలయాల్లోనే పనిచేస్తున్నారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యాలయాల్లో టీ-ఫైబర్ పరికరాలు నిరుపయోగమయ్యాయి. పంచాయతీ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనంతో పాటు ప్రజలకు డిజిటల్ సేవలు అందించాలన్న సర్కారు లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామపంచాయతీల పరిధిలో ప్రభుత్వ పథకాల్లో ఏమైనా అవాంతరాలుంటే లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయాలకు వచ్చి వాకబు చేయాల్సి వస్తోంది. పన్నులు, ఇతర రుసుములు చెల్లిస్తున్న వారికి పంచాయతీ కార్యదర్శులు చేతి రాత రశీదులే ఇస్తున్నారు

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో టీ-ఫైబర్‌కు సంబంధించిన పరికరాలు బిగించి విద్యుత్ కనెక్షన్లూ ఇచ్చారు. వాటి నుంచి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు డిజిటల్ సేవలు అందడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తే పనులు సులభతరమవుతాయి.

– శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



నిర్మల్‌లోని బాలికల కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- 6,944 మంది విద్యార్థులకు 6,510 మంది హాజరు
- పరీక్షాకేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్

నిర్మల్ రూరల్: జిల్లాలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఫస్టియర్ విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఈసారి విద్యార్థులకు ఐదు నిమిషాలు వెసులుబాటు కల్పించినా దాదాపు గంట ముందే పరీక్షాకేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 23 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేయగా, 6,944 మంది విద్యార్థులకు గాను 6,510 మంది హాజరయ్యారు. 434మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 621మంది విద్యార్థులకు 539 మంది హాజరయ్యారు. 82మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 6,323 మంది విద్యార్థులకు గాను 5,971 మంది హాజరయ్యారు. 352 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో పరశురాం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికలు, బాలుర పరీక్షా కేంద్రాలను కలెక్టర్ అభిలాష అభినవ్, ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి వేర్వేరుగా పరిశీలించారు. గురువారం నుంచి సెకండియర్ పరీక్షలు నిర్వహించనున్నారు.



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



బాలికల కళాశాల పరీక్షాకేంద్రం వద్ద ఇంటర్ విద్యార్థులు

విద్యార్థిని సెంటర్‌కు చేర్చిన ఎస్సై



వాహనంలో విద్యార్థిని తీసుకెళ్తున్న ఎస్సై

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రంలో ఇంటర్ పరీక్షలకు హాజరు కావాల్సిన ఓ విద్యార్థి పొరపాటున గురుకుల పాఠశాలకు వెళ్లాడు. అక్కడికి వెళ్లాక పొరపాటు తెలుసుకుని జూనియర్ కళాశాలకు వెళ్లేందుకు పరుగులు పెట్టాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న స్థానిక ఎస్సై సంజీవ్ గమనించి ఆ విద్యార్థిని తన వాహనంలో సకాలంలో సెంటర్‌కు చేర్చాడు. దీంతో ఎస్సైని పలువురు అభినందించారు.

కేజీబీవీల్లో ‘పోలీస్ అక్క’



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల, పక్కన ఏఎస్పీలు

- వినూత్న సేవలకు ఎస్పీ శ్రీకారం
- విద్యార్థినుల భద్రతకు భరోసా

నిర్మల్‌టౌన్/కడెం/లక్ష్మణచాంద/లోకేశ్వరం/కుంటాల: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు, బాలికల భద్రతకు ‘పోలీస్ అక్క’ పేరిట ఎస్పీ జానకీ షర్మిల సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతీ నెలలో ఒకరోజు మహిళా కానిస్టేబుళ్లు ప్రభుత్వ బాలికల విద్యాసంస్థలను సందర్శించి హాస్టళ్లలో బస చేయాలని నిర్ణయించారు. జిల్లాలోని 18 పాఠశాలల్లో దీనిని అమలు చేసేందుకు నిర్ణయించారు. ఒక్కో మహిళా కానిస్టేబుల్ ఒక్కో పాఠశాలను దత్తత తీసుకుని ప్రతీ వారం పాఠశాలను సందర్శించేందుకు ప్లాన్ చేశారు. విద్యార్థినుల మంచీచెడు తెలుసుకుని సైబర్ క్రైమ్, బ్యాడ్. గుడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ఈ విషయంపై బుధవారం సంబంధిత పోలీస్ అధికారులు, మహిళా కానిస్టేబుళ్లతో ఎస్పీ జూమ్ మీటింగ్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కేజీబీవీల్లోని విద్యార్థినుల భద్రతను పర్యవేక్షించాలని, నెలకోసారైన పాఠశాలను సందర్శించాలని ఆదేశించారు. విద్యార్థినుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని, వారిలో మనోధైర్యం నింపాలని సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా కేజీబీవీల్లోని విద్యార్థినుల భద్రతకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 18 పాఠశాలలకు 18 మంది మహిళా కానిస్టేబుళ్లను నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎప్పటికప్పుడు జూమ్ మీటింగ్ నిర్వహించి విద్యార్థినులు సమస్యలు ఎలా అధిగమించాలో వివరిస్తామని చెప్పారు. వారి సమస్యలు అర్థం చేసుకుని కౌన్సెలింగ్ ఇస్తామని వివరించారు. జూమ్ మీటింగ్‌లో అదనపు ఎస్పీలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండల కేంద్రంలో..

లక్ష్మణచాంద మండల కేంద్రంలోని కేజీబీవీలో ‘పోలీస్ అక్క’ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సై సుమలత హాజరై మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు ‘బాలికల భద్రత–మా బాధ్యత’ నినాదంతో మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



మామడ మండలం సంగ్వి విద్యార్థినులతో కానిస్టేబుల్



లక్ష్మణచాంద: విద్యార్థినులతో ఎస్సై సుమలత

కడెం మండల కేంద్రంలో..

మహిళలు, బాలికల సంరక్షణకు ఎస్పీ జానకీ షర్మిల మహిళా దినోత్సవం రోజున ప్రారంభించనున్న ‘పోలీస్ అక్క’ కార్యక్రమంపై కడెం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో మహిళా సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు.

లోకేశ్వరం మండల కేంద్రంలో..

లోకేశ్వరం మండల కేంద్రంలోని కేజీబీవీలో ‘పోలీస్ అక్క’ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు బాలికల భద్రతపై మహిళా కానిస్టేబుల్ వినిత అవగాహన కల్పించారు. విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. కుటుంబాల్లో ఎలాంటి సమస్యలున్నా పోలీసులకు తెలుపాలని సూచించారు.

కుంటాల మండలం కల్లూరులో..

కుంటాల మండలం కల్లూరు గ్రామంలోని కేజీబీవీలో ‘పోలీస్ అక్క’ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్సై భాస్కరాచారి బుధవారం రాత్రి బస చేశారు. మహిళల హక్కులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఎస్వో సంధ్యారాణి, కానిస్టేబుల్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సీటూ కమలానిదే!

- గ్రాడ్యుయేట్‌లోనూ బీజేపీ హవా
- అధిక ఓట్లతో గెలిచిన అంజిరెడ్డి
- మూడు రోజులు సాగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ
- ముగ్గురికే 92.52శాతం ఓట్లు



కౌంటింగ్ కేంద్రం వద్ద సంబురాల్లో విక్టరీ సింబల్ చూపుతున్న కేంద్ర మంత్రి సంజయ్, ఎమ్మెల్సీ విజేత అంజిరెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి: కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించారు. మూడు రోజులపాటు ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపులో ఎలిమినేషన్ రౌండ్లతో బీజేపీ గెలుపు ఖరారైంది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత కూడా గెలుపునకు సరిపడా కోటా ఓట్లు రాకపోయినా అంజిరెడ్డికి అత్యధిక ఓట్లు రావడంతో ఆయననే విజేతగా ప్రకటించారు. చివరి వరకు హోరాహోరీగా పోరాడిన కాంగ్రెస్ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంతో శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు.

సుదీర్ఘంగా సాగిన కౌంటింగ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఫిబ్రవరి 27న జరగ్గా, మార్చి 3న కౌంటింగ్ ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్విరామంగా మూడు షిఫ్టుల్లో 800మంది కౌంటింగ్ సిబ్బంది కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో 21 టేబుళ్లపై లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. సోమవారం ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభించిన అధికారులు, మంగళవారం మధ్యాహ్నం వరకు చెల్లని ఓట్లను వడపోసి, కట్టలు కట్టారు. మంగళవారం రాత్రి నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కింపు చేపట్టి బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి ఎలిమినేషన్ రౌండ్లను ప్రారంభించారు. ఎలిమినేషన్ రౌండ్లలో బరిలో ఉన్న 54మందిలో తక్కువ ఓట్లు కలిగి ఉన్న వారిని ఒక్కొక్కరిగా తొలగిస్తూ, వారికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను మిగతా అభ్యర్థులకు పంచుతూ కౌంటింగ్ ప్రక్రియను మూడు రోజుల పాటు సుదీర్ఘంగా కొనసాగించారు.



కౌంటింగ్ ప్రక్రియ పరిశీలిస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

ముగ్గురికే 92.52శాతం ఓట్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 56మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. చెల్లుబాటైన ఓట్లలో 92.52శాతం (2,06,659) మొదటి ప్రాధాన్యత ఓట్లు ఈ ముగ్గురు అభ్యర్థులకే వచ్చాయి. మిగతా 53మంది స్వతంత్ర అభ్యర్థులు 16,684 ఓట్లు మాత్రమే సాధించారు.

రెండో ప్రాధాన్యత ఓట్లలోనూ బీజేపీ హవా

నిర్ధారిత కోటా ఓట్ల కోసం అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టగా అందులోనూ బీజేపీ అభ్యర్థి ఆధిక్యం చూపారు. తొలుత 53మందిని ఎలిమినేషన్ చేసి రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించగా బీజేపీ అభ్యర్థికి 78,635 ఓట్లు, కాంగ్రెస్‌కు 73,644 ఓట్లు, బీఎస్పీకి 63,972 ఓట్లు వచ్చాయి. 53మందిని ఎలిమినేషన్ చేసినా.. కోటా ఓట్లు ఎవరూ సాధించకపోవడంతో మూడోస్థానంలోని బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను ఎలిమినేట్ చేశారు. అతనికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రసన్న హరికృష్ణను ఎలిమినేషన్ చేసిన అనంతరం బీజేపీ అభ్యర్థికి 98,637 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 93,531ఓట్లు వచ్చాయి. మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థి కన్నా 5,106 ఓట్ల ఆధిక్యంలో ఉండటంతో బీజేపీ అభ్యర్థికి విజయం వరించింది. చివరకు బీఎస్పీ అభ్యర్థికి పోలైన ఓట్లలో చాలామంది రెండో ప్రాధాన్యత ఓటు బీజేపీకే వేయడంతో ఆ పార్టీకే విజయం దక్కింది.

వందశాతం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: ఇంటిపన్ను వసూళ్లను వందశాతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గృహ, వాణిజ్య పన్నుల వసూలు, శానిటేషన్ తదితర అంశాలపై మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు వసూలు చేసిన పన్నులు, బకాయిలకు సంబంధించి మున్సిపాలిటీల వారీగా వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో పన్నులు చెల్లించనివారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు తప్పనిసరిగా వాణిజ్య లైసెన్స్‌లను పునరుద్ధరించుకునేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ భవన సముదాయాల్లో వ్యాపారం నిర్వహించుకుంటున్న వ్యాపారుల నుంచి వెంటనే అద్దె వసూలు చేయాలని సూచించారు. బకాయిలు పేరుకుపోయిన దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. సమావేశంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, రాజేశ్‌కుమార్, జాదవ్ కృష్ణ, మెప్మా పీడీ సుభాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకే ఈతలో రెండు లేగదూడలు


లేగదూడలతో మారయ్య

నెన్నెల: మండలంలోని జెండా వెంక టాపూర్ గ్రామానికి చెందిన బోర్లకుంట మారయ్య పెంచుకుంటున్న ఆవు బుధవారం సాయంత్రం ఒకే ఈతలో రెండు లేగదూడలకు జన్మనిచ్చింది. దీంతో రైతు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఒకే ఈతలో రెండు దూడలు జన్మించడం చాలా అరుదుగా జరుగుతుందని పశువైద్యాధికారి చేతన్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి, ఎదుల బంధం గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం ఆయా గ్రామాల్లో దాడులు నిర్వహించి 24 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైళ్లోంచి కిందపడి ఒకరికి గాయాలు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

బాసర: రైళ్లోంచి దిగుతుండగా కాలుజారి కిందపడడంతో ఒకరికి గాయాలైన సంఘటన బాసర రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. కామారెడ్డికి చెందిన కృష్ణసాయి బుధవారం మహబూబ్‌నగర్ నుంచి రాజ్‌కోట్ వెళ్లే రైలులో ప్రయాణిస్తున్నాడు. బాసరలో రైలు దిగుతుండగా కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అంబులెన్సులో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు జీఆర్‌పీ పోలీసులు సురేశ్, తిరుపతి తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఉట్నూర్‌రూరల్: ఘన్‌పూర్ పంచాయతీ పరిధిలోని చింతగూడలో గంగాధర్‌కు చెందిన ఇల్లు బుధవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఘటనలో ఇంట్లో ఉన్న రూ.60 వేల నగదు, రెండు క్వింటాళ్ల పత్తి, సామగ్రి దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు.

పక్షుల లెక్క తేలింది

- జన్నారం డివిజన్‌లో 201 రకాలు గుర్తింపు
- అటవీశాఖ, వరల్డ్‌వైడ్ లైఫ్‌ఫండ్ ఆధ్వర్యంలో సర్వే

జన్నారం(ఖానాపూర్): పక్షుల గమనానికి పరిధిలు లేవు. అవి ఖండాలు దాటి ప్రయాణిస్తూ పర్యావరణంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. పర్యావరణంలో జరిగే పెను మార్పుల వల్ల కొన్ని జాతుల పక్షులు వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి వలస వెళ్తుంటాయి. ఇలాంటి పక్షులను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పక్షులు ఎంతో జీవవైవిధ్యం ప్రదర్శిస్తూ మానవాళి మనుగడకు, పర్యావరణానికి ఎంతో మేలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా పక్షుల వివరాలను తెలుసుకునేందుకు అటవీశాఖ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సంస్థలు సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. ఈ ఏడాది జనవరి 24 నుంచి 26 వరకు జంతుగణన మాదిరి కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పక్షుల గణన చేశారు. 28 మంది సభ్యులు ఏడు బృందాలుగా ఏర్పడి డివిజన్‌లోని 40 అటవీ బీట్‌లలో సర్వే చేశారు. డివిజన్‌లో సంచరిస్తున్న పక్షుల వివరాలను సేకరించారు. వీటితో పాటుగా అంతరించిపోయే దశలో ఎన్నిరకాల పక్షులు ఉన్నాయి? ఏఏ కేటగిరీలో ఏ పక్షులున్నాయో సర్వేలో తేలినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

201 రకాల పక్షులు

జన్నారం అటవీ డివిజన్‌లో నిర్వహించిన సర్వేలో 201 రకాల పక్షులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అటవీశాఖ, వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో పక్షులపై సమగ్ర పరిశీలన చేశారు. 11 రకాల పక్షి జాతులు అంతరించి పోయే దశలో ఉన్నాయని, 57 రకాల పక్షులు కేవలం అటవీ, ప్లాంటేషన్ ఏరియాలో సంచరిస్తున్నాయని, మన పరిసరాల్లో తిరిగే పక్షులు 18, కీటకాలు తినే పక్షులు 99 రకాలు, కేవలం పండ్లను మాత్రమే తినే పక్షులు 16 రకాలు ఉన్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు.


జన్నారం డివిజన్‌లో కనిపించిన లెస్సర్ విస్లింగ్ డక్స్

పక్షులపై అవగాహన

ప్రస్తుత రోజుల్లో పక్షుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యార్థి దశ నుంచే దీనిని ఒక హాబీగా పెట్టుకోవాలనే ఉద్దేశంతో పక్షులు, వాటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకు అటవీశాఖ నిర్ణయం తీసుకోనుంది. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే సైన్స్ టీచర్లను అడవుల్లోకి తీసుకెళ్లి బర్డ్‌వాక్ కార్యక్రమం చేపట్టనున్నారు. వీటితో పాటుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సంస్థ ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలు పాఠశాలల్లోని విద్యార్థులకు వివరించనున్నారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. పక్షుల సంరక్షణపై, పక్షులు అంతరిస్తే కలిగే నష్టాలు, జీవ వైవిధ్యంలో పక్షుల పాత్ర, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

ప్రతీ ఆర్నెల్లకోసారి..



ప్రతీ ఆర్నెల్లకోసారి పక్షులపై అవగాహన కల్పించే యోచన చేస్తున్నాం. ఎప్పటికప్పుడు పక్షుల రకాలను గుర్తించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వలంటీర్లగా నియమించాలని యోచిస్తున్నాం. అర్హులైన స్థానికులను నేచర్ గైడ్‌లుగా నియమిస్తాం. – శివ్‌ఆశిష్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి, మంచిర్యాల

జిల్లాకు ఎయిర్‌పోర్ట్ తీసుకొస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, పక్కన ఎంపీ గోడం నగేష్

- ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్: జిల్లాకు ఎయిర్ పోర్ట్ తప్పకుండా తీసుకువస్తామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి మాట్లాడారు. ఇటీవల మాజీ మంత్రి జోగు రామన్న చేసిన వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ నాయకులు అవగాహన రాహిత్యంతో అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఐదు సంవత్సరాలు మంత్రిగా ఉన్న జోగు రామన్న జిల్లా ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో ఎయిర్ ఫోర్స్ అకాడమీ ఏర్పాటు కోసం 2014లో తాను ఎంపీగా ఉన్న సమయంలో కృషి చేశానన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థలం ఇవ్వని కారణంగానే ఎయిర్ పోర్ట్ అకాడమీ పెండింగ్‌లో ఉందన్నారు. ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్‌కు సంబంధించి 2011లోనే సర్వే జరిగిందన్నారు. ఇదే రైల్వే లైనుకు ఆర్మూర్-ఆదిలాబాద్ వయా నిర్మల్ కు జాయింట్ వెంచర్ అగ్రిమెంట్ చేసుకోవడానికి ఇద్దరు మంత్రులను కలిసినా పట్టించుకోలేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు వేద వ్యాస్, రఘుపతి, లాలా మున్నా, నగేష్, కృష్ణ, కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్


నాయకులతో సమీక్షిస్తున్న మీనాక్షి నటరాజన్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా సమష్టిగా ముందుకు సాగాలని టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, రేఖానాయక్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడె గజేందర్, పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, తదితరులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులకు ఆమె స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అన్ని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేలా ఐక్యంగా పనిచేయాలన్నారు. ఎలాంటి విభేదాలకు తావులేకుండా పార్టీ పటిష్టత, స్థానిక సంస్థలన్నింటిలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి

- ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్


మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలని బాసర ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. బుధవారం స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్, స్టూడెంట్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధైర్యపడితే అపజయాలు ఆహ్వానిస్తాయని, ధైర్యంగా ముందుకెళ్తే విజయ సోపానం అవుతుందన్నారు. ఎస్‌ఈఐఎఫ్ ఫౌండర్ శామ్యూల్‌రెడ్డి, డైరెక్టర్ జ్యోతిర్మయి విద్యార్థులకు తమ సలహాలు అందించారు. సినీ నటుడు, మోటివేషనల్ స్పీకర్ ప్రదీప్ విద్యార్థుల్లో ఉత్సాహం నింపుతూ ప్రేరణ కల్పించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మలేషియా జైలులో కడెం వాసులు


అధికారితో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

కడెం: మండలంలోని లింగాపూర్‌కు చెందిన రాచకొండ నరేష్, తలారి భాస్కర్, గురిజాల శంకర్, గురిజాల రాజేశ్వర్, గుండా శ్రీనివాస్, దస్తురాబాద్ మండలంలోని మూన్యాల్ గ్రామానికి చెందిన యమునూరి రవీందర్ ఉపాధి నిమిత్తం గతేడాది మలేషియాకు వెళ్లారు. కొన్ని కారణాల వలన జైలులో ఉన్నారని కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ కలిసి విడుదల చేయించాలని వేడుకున్నారు. మలేషియా వెళ్లి ఉన్నతాధికారులను సంప్రదించాడు. అక్రమ ఆయుధ చట్టం కింద జైలులో ఉన్నారని తెలుసుకుని బాధితులను పరామర్శించాడు. విడుదల చేసేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించాడు.

గోదావరిలో నీట మునిగి వ్యక్తి మృతి


మారుతి (ఫైల్)

బాసర: నిర్మల్ జిల్లా బాసర గోదావరిలో నీటమునిగి ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని బీదరిల్లి గ్రామానికి చెందిన డోన్ గాలే మారుతి (34) కుటుంబ సభ్యులతో కలసి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌తో పాటు ఇతర పుణ్య క్షేత్రాలను దర్శించుకున్నాడు. తిరుగు ప్రయాణంలో బుధవారం బాసర గోదావరినదికి వచ్చారు. స్నానం చేస్తుండగా లోతు ఎక్కువగా ఉండడంతో నీటమునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

తాండూర్: ఈ నెల 2న రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. అచ్చులాపూర్ పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన పెరుగు రాజయ్య (57) ఐబీ నుంచి నయారా పెట్రోల్‌బంక్ వద్దకు బైక్‌పై వెళ్తుండగా రేచినీ గ్రామానికి చెందిన భీంరావు ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి ఢీ కొట్టాడు. ఘటనలో రాజయ్యకు తీవ్ర గాయాలు కావడంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీంరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మహిళ..


లక్ష్మీబాయి (ఫైల్)

సోన్: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గాంధీనగర్ గ్రామానికి చెందిన లక్ష్మీబాయి (54) మంగళవారం సరస్వతీ కాలువలో చేపలు పట్టడానికి వెళ్లింది. చేపలు పట్టే క్రమంలో ఒడ్డు మీద నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడిపోయింది. బుధవారం పోలీసులు మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హైమద్ మోహిసుద్దీన్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

నెన్నెల: గత నెల 28న మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలి పారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లికి చెందిన తోకల రాజేశం (34) అత్తగారి ఊరైన నెన్నెల మండలం మైలారంలో ఉంటున్నాడు. ఫిబ్రవరి 28న మద్యం మత్తులో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని సోదరుడు తోకల సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'తుమ్మల'కు కవిసంధ్య పురస్కారం


తుమ్మల దేవరావు

నిర్మల్‌ఖిల్లా: ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కవిసంధ్య సాహితీ సంస్థ, నారాయణరావు ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి కవితా పోటీలలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తుమ్మల దేవరావుకు కవిసంధ్య పురస్కారం దక్కింది. అతను రచించిన 'వరి గొలుసులు' కవిత కన్సోలేషన్ బహుమతికి ఎంపికైనట్లు కవిసంధ్య సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈటల శిఖామణి, దాట్ల దేవదానం రాజు తెలిపారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియం లో అవార్డు అందుకోనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి (జి) గ్రామానికి చెందిన రాథోడ్ దినేష్ ఇల్లు బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దినేష్ తన ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనలో ఇంట్లోని సామగ్రితో పాటు రూ.2 లక్షల 50 వేల నగదు, ఐదు గ్రాముల బంగారం కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. సంఘటన స్థలాన్ని ఆర్‌ఐ సుమలత , పంచాయతీ కార్యదర్శి శివకుమార్ సందర్శించి పంచనామా నిర్వహించారు.

తిమ్మాపూర్‌లో 800 కోళ్లు మృతి


కోళ్లను పరిశీలిస్తున్న పోలీసులు

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్‌లో పునేందర్‌కు చెందిన ఫామ్‌లో బుధవారం 800 కోళ్లు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి విఠల్ కోళ్ల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కోళ్లు తాగే నీటిలో విషం కలిపి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. ల్యాబ్ నుంచి పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత కోళ్ల మృతికి గల కారణాలు తెలుస్తాయన్నారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని పునేంధర్ వాపోయాడు.

గంజాయి సేవిస్తున్న ఎనిమిది మంది అరెస్టు

చెన్నూర్: మండలంలోని కిష్టంపేట శివారులో గంజాయి సేవిస్తున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిష్టంపేట జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న పదిమంది యువకులను పట్టుకుని విచారించగా గంజాయి సేవిస్తున్నట్లు ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో ఒకరు మైనర్‌కాగా మరొకరు పరారయ్యారన్నారు. ఎస్సై సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్రలో ట్రాలీ బోల్తా..

- గుడిహత్నూర్ వాసులకు గాయాలు

గుడిహత్నూర్: మహారాష్ట్రలో ట్రాలీ వాహనం బోల్తా పడిన ఘటనలో మండలానికి చెందిన నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని గురుజ గ్రామానికి చెందిన జాదవ్ రాజు మంగళవారం 16 మంది బంధుమిత్రులతో కలిసి దైవదర్శనానికి మహారాష్ట్రంలోని చంద్రపూర్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న వాహనం కోర్పణ గ్రామ సమీపంలో బోల్తా కొట్టింది. దీంతో రాజుతో పాటు అతని తల్లి సీతాబాయి, మరో యువకుడు గెడం జగదీష్, నాందేడ్‌కు చెందిన మహిళ, రాజు మేన కోడలుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ముందుగా రిమ్స్ తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సీతాబాయిని హైదరాబాద్‌కు, అత్త, మేనకోడలిని నాందేడ్ తరలించి చికిత్స అందిస్తున్నారు. గెడం జగదీష్‌తో పాటు పలువురు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ప్రమాదం జరిగిందని కోర్పణ పోలీసులు తెలిపారు.

121 ప్రైవేటు డిగ్రీ కళాశాలల పరీక్ష ఫలితాలు నిలిపివేత

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని డిగ్రీ కోర్సుల మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను ఈ నెల 4న రాత్రి విడుదల చేసిన విషయం తెలిసిందే. కానీ డీన్ అకాడమిక్‌కు ఫీజులు చెల్లించని 121 ప్రైవేటు డిగ్రీ కళాశాలల ఫలితాలను నిలిపి వేశారు. ఇప్పటికే ఫీజులు చెల్లించాల్సి ఉండగా.. అప్పట్లో ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డిని, అప్పటి రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కలిశారు. ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంటు ఇవ్వడం లేదని, కొంత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. 15 నుంచి 20 రోజుల వరకు సమయం ఇచ్చారు. పరీక్షలు పూర్తయ్యాక యూనివర్సిటీ అకాడమిక్ డీన్ ఆయా కళాశాలలకు ఫీజులు చెల్లించాలని నోటీసులు పంపారు. బుధవారం వరకు 121 ప్రైవేటు కళాశాలలు ఫీజులు చెల్లించలేదు. ఫీజులు చెల్లించిన కళాశాలల ఫలితాలు వెబ్‌సైట్‌లో ఉంచి చెల్లించని వారివి నిలిపివేశారు. తమ ఫలితాలు చూసుకునే వీలులేకపోవడంతో ఆయా కళాశాలల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫీజులు చెల్లించినట్లు క్లియరెన్స్ వస్తేనే ఫలితాలు వెల్లడిస్తామని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ స్పష్టం చేశారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి


విలాస్ (ఫైల్)

సిరికొండ: విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తుమ్మల్‌పాడ్ గ్రామానికి చెందిన ఇంగోలే నాగోరావ్, కుసుంబాయి దంపతుల రెండో కుమారుడు ఇంగోలే విలాస్ (24)బుధవారం ఇంటి మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుత్ వైరుకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఇచ్చోడ ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందాడు. మృతుడు ఆరునెలల క్రితమే దుబాయ్ నుంచి ఇంటికి వచ్చాడని గ్రామస్తులు తెలిపారు.

గోండుగూడలో ఒకరు..

కడెం: మండలంలోని చిట్యాల్ గోండుగూడకు చెందిన పందిరి జలపతి (56) గోదావరి నదిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జలపతి ఈనెల 4న స్నానం చేయడానికి గోదావరినదికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుని భార్య సీతాబాయి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం


కొమురయ్య (ఫైల్)

లక్సెట్టిపేట: గత నెల 27న ఓమన్‌లో మృతి చెందిన వలస కూలీ మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని హన్మంతుపల్లి గ్రామానికి చెందిన గుమ్ముల కొమురయ్య (48) ఉపాధి నిమిత్తం రెండేళ్లక్రితం ఓమన్ దేశానికి వెళ్లి అక్కడ భవన నిర్మాణ రంగంలో కూలీగా పనిచేస్తున్నాడు. నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్తులో పనిచేస్తుండగా అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

దండేపల్లి: గడ్డిమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసినోద్దీన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెల్గనూర్‌కు చెందిన అక్కల మల్లేశం (79) కొన్నేళ్ల క్రితం భార్య, ఇద్దరు కుమారులను కోల్పోయాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందడంతో ఈనెల 4న గడ్డిమందు తాగి వాంతులు చేసుకోవడంతో గమనించిన స్థానికులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని కుమార్తె రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అధికారి ఇంట్లో చోరీకి విఫలయత్నం

భైంసాటౌన్: పట్టణంలోని సాయికాటన్ ఏరియాలో ఉంటున్న ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్ ఇంట్లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. సాయికాటన్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న భైంసా ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్ మంగళవారం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. బుధవారం ఇంటి తాళం తెరిచి ఉండడం గమనించిన స్థానికుల సమాచారంతో అతను వచ్చి పరిశీలించగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇంట్లో విలువైన వస్తువులు, నగదు లేవని చెప్పారు.

అడవి పందుల దాడిలో ఇద్దరికి గాయాలు

పెంబి: మండలంలోని సక్కిగూడ గ్రామానికి చెందిన సిడాం లక్ష్మణ్, సిడాం తుకారాం మంగళవారం రాత్రి షెట్‌పల్లి సమీపంలో ఉన్న చేనుకు కాపలాగా వెళ్తుండగా ఒక్కసారిగా అడవి పందులు దాడి చేయడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ కృష్ణ, పైలెట్ అజర్ ప్రథమ చికిత్స అందించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.